


# అనగనగా ఓ మంచి కథ

## గుడ్‌బై

### చిట్టారెడ్డి సూర్యకుమారి.

( ఆంధ్రవారపత్రిక 1977 ఏప్రిల్ 1)




**మలి సంధ్య.** చల్లని పిల్లగాలుల్లో తేలిపోతున్న మబ్బు తునకలు జలజలమని నీటి బిందువులను చల్లిపోతున్నాయి. ఇంద్రధనస్సు వెండి మబ్బుల్లోనుంచి ఆకాశానికి వారధి వేసింది.

నులి వెచ్చని ఎండలో వర్షపు చినుకులు. అపురూపంగా వున్న ప్రకృతి దృశ్యం. సుజన మనస్సును తాకలేదు.

సుజన చేతిలో వున్న ఉత్తరం చిరుగాలికి రెపరెపలాడుతూంది. బోనులో వున్న సింహం మాదిరిగా ఆమె మనస్సు ఆరాటంగా, అసహనంగా వుంది.

సుజన ఇద్దరు బిడ్డలకి తల్లి. పెద్దవాడు రంజన్. చిన్నది మనోరంజని. కోరికున్న కోక, ఇష్టమైన నగ తెచ్చివ్వగలిగే భర్త, పరిమిత కుటుంబం సుఖంగా, ఆనందంగా వుందని తెలిసిపోతుంది.

ప్రతి స్త్రీ కోరుకునే జీవితం తనకుందని చల్లని సంసారంలో తన బ్రతుకూ హాయిగా గడచిపోతుందని తలచింది. కాని, తన లోటేమిటో ఎవ్వరికి చెప్పుకోలేనిది. చెప్పుకున్నా తేలిగ్గా నవ్వేస్తారు.

హృదయాన్ని కళ్ళల్లో పెట్టుకుని ఆ ఉత్తరాన్ని చూసింది కన్నీళ్ళు ఉప్పొంగి వచ్చాయి. ఉత్తరాన్ని గుండెలమీదకి చేర్చుకుంది.

గదిలో దీపం వెలిగింది సుజన వులిక్కిపడింది.

“చీకట్లో వున్నావేం?” అంటూ వచ్చిన భర్త నిరంజన్ సుజన గుండెలపై వున్న ఉత్తరం వైపు ప్రశ్నార్ధకంగా చూశాడు. ఆ ఉత్తరాన్ని చూసి చదవకుండానే తిరిగి ఇస్తూ.

"ఏమంటున్నాడు నీ కొడుకు?" అంటూ వెనుతిరిగాడు.

"ఆ చిన్నవాడిమీద మీకెందుకు పగ ఎందుకు కక్ష సాధిస్తున్నారు? ఏమైనా వుంటే నా మీద తీర్చుకోండి" అని అందామనుకుంది. అతి దుఃఖంతో మాట బయటికి రాలేదు. ఆ తల్లి హృదయం విలవిలలాడింది.

"ఏం అమ్మా ఎక్కడికి వెళ్ళావు?"

ఆ కంఠంలో తండ్రి ప్రేమ తొణికింది.

"పార్కుకి వెళ్ళాను డాడీ" పాప డాడీ మీద ఎక్కి ముద్దు ఇచ్చింది. చీకటి పడే వరకు పార్కులో వున్నందుకు పనిపిల్లని చివాట్లు పెడుతూ పాపని బాత్‌రూము వైపుకి తీసుకువెళ్ళాడు నిరంజన్. తండ్రి సబ్బుతో కాళ్ళు చేతులు కడుగుతుంటే పాప గుక్కతిప్పుకోకుండా కబుర్లు చెప్పుతూంది.

ఆ తండ్రి మనస్సు అర్ధం చేసుకోలేకపోతోంది. అతని పోలికతో వున్న పాప అంటే ప్రాణాలు. తల్లి పోలిక కొడుక్కి అదృష్టమంటారు. కాని ఆ కొడుకంటే తండ్రికి పడదు. ఎదురుగా వుంటే చిటపటమంటూనే వుంటాడు. వాడ్ని ఎత్తుకున్నట్లు, ముద్దు చేసినట్లు గుర్తే లేదు. ప్రధమ సంతానం అపురూపం. తొలి మధుర స్మృతులకు చిహ్నం. ఇద్దరూ కలసి మొదటి బిడ్డను పెంచుతారు. కొడుకును తాకి తాకనట్లుండే మనస్సు కలుక్కుమనేది. ఆ మాట చెప్పలేక మనస్సుండబట్టలేక అమ్మతో చెప్పింది.

"కొందరు మగాళ్ళు అంతే తల్లీ! పసిగుడ్డును ఎత్తుకోరు భయం. కొందరికి ఇష్టం వుండదు. ఎత్తుకోను చేతకాక భయం వుంటుంది. ఇంతెందుకు మీనాన్నగారు నడిచేంతవరకు ఎత్తుకోలేదు" అని చెప్పింది.

రంజన్‌కి మాటలు వచ్చాయి, స్కూలుకి వెళ్ళాడు. అతనిలో మార్పులేదు.

"కూతురంటే ప్రాణం, కొడుకుని ఆమడదూరంలో వుంచుతారు" అని తన స్నేహితురాలితో చెప్పుకుంది.

ఆ స్నేహితురాలు పకపకా నవ్వింది.

"మగపిల్లాడు. అందునా పెళ్ళయిన వెంటనే పుట్టుకువచ్చాడు నీ ప్రేమను పంచలేకపోయాడు. జెలసీ. మరేం కాదు. క్షణం పడని తండ్రి కొడుకులను చూశాను" అని చెప్పింది.

కొడుకు సమీపమే సహించలేనట్లు ఐదో ఏడు నిండకముందే హాస్టలున్న స్కూల్లో చేర్పించాడు.

"నీ ప్రేమతో వాడ్ని పాడు చేస్తావు. మంచి క్రమశిక్షణలో పెరగాలంటే హాస్టల్లో వుండక తప్పదు. పిల్లవాడి భవిష్యత్తు చూడు. పిచ్చి ప్రేమను కట్టేయి" అని ఏడుస్తున్న సుజనను వోదార్చాడు.

ప్రతిరోజు కొడుకుని చూసుకుని వచ్చేది. అక్కడి టీచర్లకి, ఆయాలకి చెప్పి, చెప్పి వచ్చేది. తల్లిని చుట్టుకుపోయి వదిలేవాడు కాదు.

రంజన్‌కి హాస్టలు జీవితం అలవాటైనా, వచ్చి వెళ్తున్న అమ్మవైపు బిక్కుబిక్కుమని చూస్తుంటే చెప్పలేని బాధ కలిగేది. ఆ రాత్రి అంతా నిద్రపట్టేది కాదు. నిద్రపోతున్న భర్తను లేపి "ఏమండీ! మీరు వీధిబడిలోనే కదూ చదివింది. మీరు చెడిపోలేదుగా! ఇప్పటికీ మీ అమ్మను చూడకుండా వుండలేరు" అని అడిగేది.

క్రమశిక్షణ అంటూ కఠినంగా పెంచినా రంజన్‌కి ఆ తండ్రి అంటే అణువణువునా ప్రేమ 'డాడీ! డాడీ' అంటూ కలవరించి పోతాడు. విసుగు, చిరాకు, కోపాలే తండ్రి నుంచి చవి చూసింది.

పాప పుట్టింది. పొత్తిళ్ళల్లోని పాపని అతి సున్నితంగా జాగ్రత్తగా ఎత్తుకుంటే సుజన ఆశ్చర్యంగా చూసింది. తండ్రి ప్రేమనంతా పాప పొందుతుంటే ధ్రువుడిలా దూరంగా వుండి చూసే కొడుకుని ఎత్తుకుని ముద్దాడి తల్లి ప్రేమలోని మాధుర్యం చూపేది సుజన.

ఉన్న ఊర్లో స్కూలు, కాలేజీ వున్న పబ్లిక్ స్కూలు అంటూ దూర ప్రదేశానికి పంపేశాడు. పెద్ద క్లాసుల్లో సీటు దొరకదు. పోటీ ఎక్కువ. అందుకే జాగ్రత్తపడి చిన్న క్లాసులోనే మంచి స్కూల్లో చేర్పించి భవిష్యత్తుకు పునాది వేశాడు అని అందరూ భర్తను అభినందిస్తుంటే సుజన తికమక పడింది. మనస్సును కూడదీసుకుంది.

జ్వరం వచ్చిందని అమ్మని, డాడీని చూడాలని వుందని రంజన్ వ్రాస్తే మనస్సును గట్టి పరచుకోలేకపోయింది. దిండులో తలదూర్చి పడుకున్న సుజనను చూశాడు. నిద్రపోతున్నట్టున్నా ఆమె మూగగా ఏడుస్తున్నదని గ్రహించాడు. ఆలా పడుకున్న సుజనను చూస్తుంటే మనస్సు ఆర్థ్రమైంది. లేచి వోదార్చి ఆమె ఇష్టాన్ని తీర్చాలనిపించింది. కాని తనకాశక్తి భగవంతుడు ఇవ్వలేదు సుజానా అని అనుకున్నాడు.

బాబుకి జ్వరం వచ్చింది వెళ్ళి తీసుకురమ్మంది "చిన్నచిన్న జ్వరాలు పిల్లలకి రావడం మామూలేను. అక్కడ సంరక్షణకి లోపం వుండదు. చీటికిమాటికి వస్తే అదే అలవాటవుతుంది స్కూలు పోతుంది" అన్నాడు.

"నేను వెళ్ళి వస్తాను" అంది.

"పాపకి బడి పోతుంది."

"మీరైనా చూసిరండి"

"నాకు బోలెడు పనులు."

మరి అడగలేదు సుజన. బ్రతిమాలలేదు. ఏడ్వలేదు. మౌనం వహించింది అభిమానం వున్న ఆమె మరేం చేస్తుంది. పదేళ్ళ కాపురంలో ఒక్క తప్పు పట్టలేకపోయాడు. భార్యగా తల్లిగా గృహిణిగా తన ధర్మాన్ని నెరవేర్చింది. నెరవేర్చుతుంది.

సుజనను మొదటిసారి చూడగానే తనను ఆకర్షించింది ఆమె అందంకాదు. ఆ కళ్ళలో కనిపించిన భావాలు. ఎదుట మగవాడికంటే తను ఎందులోను తక్కువకాదు అన్నభావం చూడగలిగాడు.

ఇద్దరికి ఏకాంతం కలిగించి పెద్దలు తప్పుకున్నప్పుడు 'ఎవరినైనా ప్రేమించారా?' అని అడిగాడు. కళ్ళెత్తి సూటిగా నిర్భయంగా చూసింది. అవుననలేదు. కాదనలేదు.

భార్యను ఎంతగానో ప్రేమించాడు. సరిగ్గా తొమ్మిది నెలలకి కొడుకు నిచ్చింది.

ప్రధమ ఫలం కొడుకైనా, ప్రేమించలేకపోయాడు. ఎందుకు? ఎందుకూ? అసహనంగా అటూ ఇటూ పొర్లి నిద్రలోకి జారిపోయాడు.

బడికి పోతున్న పాప బుగ్గను ముద్దుపెట్టుకున్నాడు. వెచ్చగావుంది. వళ్ళంతా తడిమి చూసి "పాపా! జ్వరంగా వుందా?" ఆత్రంగా అడిగాడు. వాతావరణంలో శరీరం ఉష్ణోగ్రత ఎలావుందో అన్నట్టుగా తన పొట్ట, నుదురు పట్టుకుని చూసుకున్నాడు.

"పరీక్ష వుందట. బడికి పోనివ్వండి" వెనకనేవున్న సుజన అంది.

నీవు తల్లివేనా? అన్నట్లుగా చూసి "మనకోసం చదువులుకాని, చదువులకోసం మనం కాదు" అంటూ హడావుడిగా పాపను ఎత్తుకుని డాక్టరు దగ్గరకిపోతున్న భర్తను సుజన చూస్తూండిపోయింది.

ఆ రోజు నిరంజన్ ఇంటికి వస్తూ పాపకోసం చేతినిండుగా ఏవేవో తెచ్చాడు.

"పాపా! " అంటూ వచ్చిన అతనికి ఎదురుగా 'డాడీ!' అంటూ చిత్తరంజన్ వచ్చాడు. ద్వారంలో నిల్చున్న సుజన నవ్వుతూ చూస్తుంది. కన్నుల్లో కొంటెదనం నవ్వులో చిలిపితనం ముఖానికి మరింత అందాన్ని తెచ్చాయి.

హృద్యంగా వున్న ఆమెని హృదయానికి చేర్చుకునేవాడు. ఆనందానికి అంతరాయంలా చిత్తరంజన్ కనిపించాడు. భృకుటి ముడిచి 'ఎప్పుడు వచ్చావ్? ఎలా వచ్చావ్?' అన్నాడు.

ఆ కంఠంలోని కోపానికి రంజన్ అడుగు వెనక్కి పడింది. అమ్మవైపు చూశాడు. సుజన పదేళ్ళ కొడుకుని ఎత్తుకుని చెంపలు నిమురుతుంటే సిగ్గుగా తల్లి భుజంపై వాలిపోయాడు.

"చూసి రమ్మని రంగన్నని పంపాను. జ్వరంలో ఫిట్సు కూడా వచ్చాయట. కొన్ని రోజులు ఇంట్లో వుంటే మంచిదని ప్రిన్సిపాల్ పంపించాడు.."

చిత్తరంజన్ బాగా చిక్కిపోయాడు. ముఖంలో కళ్ళే కనిపిస్తున్నాయి. తల్లి పోషణ అవసరమనిపించింది. మరేం అనలేకపోయాడు.

అలా వచ్చిన చిత్తరంజన్ని మరి పంపలేదు సుజన. అక్కడే వున్న ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించింది.

కంటికెదురుగా రంజన్ వుంటే తప్పిపోయిన కొడుకు మరలా దొరికినంత సంతోషంగా వుంది సుజనకు.

ఆ సంతోషంలో ఆ చిన్న హృదయానికి కలిగిన గాయాన్ని గుర్తించలేకపోయింది.

ఎప్పుడో సెలవలకి వచ్చి, వచ్చినంత తొందరగా గడిచిపోయే రోజుల్లో ఏ విషయమైనా పట్టింపుగా ఆలోచించే తీరిక, గ్రహింపు చేసుకునే పెద్ద మనస్సు వుండేవికావు. ఒకే తల్లి, తండ్రి పిల్లల్లో తండ్రి చూపే ప్రేమలో పక్షపాతం అడుగడుగునా చవిచూస్తుంటే ఆ చిన్నారి మనస్సు చివుక్కుమంటూ ముడుచుకుపోయేది. చెల్లి చిన్నది కనుక ఒకపాలు మురిపెం చేయడం బాగానే వుంది. చెల్లి అంటే తనకీ ప్రేమే. కాని.. కాని డాడీ తనను ఎందుకు ఇలా ట్రీట్ చేస్తారో అర్థం అయ్యేది కాదు.

“చెల్లిని ఎత్తుకున్నట్లు ఎత్తుకోకపోయినా ముద్దు చేయకపోయినా (పెద్దవాడ్నిగా) మంచిగా మాట్లాడవచ్చుగా.” అసహ్యంగా, అంటరానివాడికిచ్చినట్లు మిఠాయిపొట్లం విసిరేస్తుంటే మరి దగ్గరకు చేరలేకపోయేవాడు. ఏదో జబ్బు చేసినట్లనిపించేది. అలాటి ఆలోచనలో వున్న చిత్తరంజన్‌లో చురుకుదనం ఉత్సాహం లోపించాయి. చదువులో వెనక పడ్డాడు. ఆ మానసిక బాధ గ్రహించలేని సుజన చిత్తరంజన్ని ఇక్కడికి తెప్పించి పొరపాటు చేశానా? అని అనుకోకపోలేదు.

"ఏమండీ బాబుకి కాస్త పాఠాలు చెప్పండి" అని హెచ్చరించింది.

నిరంజన్ "ఏవీ నీ పుస్తకాలు ఎందుకు చదవటంలేదట. ఎలా? మీ ప్రిన్సిపాల్ రిపోర్టు చేశాడు. అని అంటే చిత్తరంజన్ సంబరంగా పుస్తకాలు పట్టుకువచ్చి కూర్చున్నాడు. ఏ కాస్త లెక్క తప్పు చేసినా స్పెల్లింగ్ తప్పు వ్రాసినా "ఏమిటీ ఈ చిన్న లెక్కరాదూ.. ఇంగ్లీషులో ఇన్ని బూతులు వ్రాస్తున్నావా? ఇంతకాలం నీవు చదివిన చదువు ఇదా?" అంటూ చేతిలో ఏం వుంటే దాంతో తలమీద కొట్టేవాడు. దరిదాపుల్లో సుజన వుంటే మరీ విజృంభించేవాడు.

అమ్మ ఎక్కడ వింటుందోనని సిగ్గుపడి వచ్చే ఏడుపును దిగమింగేసేవాడు. ఎంత కొట్టినా ఏడవనివాడిని చూస్తుంటే చిర్రెత్తినట్లు చెంపలు వాయించేవాడు.

సుజన అడపాదడపా భర్త కొడుకుని కొడుతుంటే చూసినా చూడనట్లుండేది. చదువు దగ్గర ఆ మాత్రం భయం పెట్టాల్సిందే అనుకునేది. దెబ్బలు తిన్నరోజు అందరూ నిద్రపోయే సమయాన చిత్రరంజన్ ఏడ్చి ఏడ్చి బరువు దించుకుని నిద్రపోయేవాడు.

బాగా దెబ్బలు తిన్నరోజు మొండికి పడినట్లు హోంవర్క్ చేయకుండా బడికి వెళ్ళేవాడు. అక్కడా ఫాదర్‌తో దెబ్బలు తిని క్లాసు బయట నిలబడేవాడు. తనను తాను అలా శిక్షించుకుంటే ఎవరినో సాధించి కక్ష తీర్చుకున్నట్లు భావించేవాడు.

ఆ సాయంకాలం స్కూలునుంచి వస్తుంటే ఫాదర్ తన రూముకి చిత్తరంజన్ని పిలుచుకుపోయాడు. మరికొన్ని 'తిట్లు' పెడతాడు అనుకుంటూ మొండి మనిషిలా నిల్చున్నాడు.

తెల్లని ముఖం వాడిపోయింది. చెదరిన వుంగరాల జుట్టులోంచి ఒక పాయ కంటిమీద పడింది. గుండ్రని పెద్ద కళ్ళు నిర్భయంగా  చూస్తుంటే ఫాదర్ మెత్తగా నవ్వుతూ దగ్గరకు తీసుకుని నుదుటిమీద వెంట్రుకలు సరిచేసి "నీకు హెయిర్‌కట్ అవసరం మై బాయ్" ఇంగ్లీషులో అన్నాడు.

"రంజన్ నువ్వు స్వతహాగా తెలివైన వాడివని నీ కళ్ళే చెపుతున్నాయి. పబ్లిక్ స్కూలు స్టూడెంటువి. ఎందుకు హోం వర్క్ చెయ్యలేదు? ఆరోగ్యం సరిగ్గా లేదా? నీకు కష్టమైన లెసన్స్ నా దగ్గరకు వచ్చి చెప్పించుకో. నీకు కష్టమేంటి?" అని లాలనగా ఫాదర్ అడుగుతుంటే మొండితనం ఆవిరైపోగా ఫాదర్‌ని కరుచుకుపోయి వెక్కివెక్కి ఏడ్చాడు.

ఫాదర్ మరింకేమీ మాట్లాడలేదు వీపు నిమురుతు మౌనంగా వోదార్చాడు.

ఏదో ఆ పిల్లవాడిని మానసికంగా బాధిస్తుంది. రేపు పేరెంట్సును పిలిచి  సంప్రదించాలని అనుకున్నాడు.

"చిత్తరంజన్ నువ్వు మంచివాడివి, బాగా చదువుతావు కదూ. నేను నీ ఫాదర్‌ని, నీకేం భయంలేదు. నీలాంటి పిల్లలకే దేవుడు తోడుగా వుంటాడు" అలా వోదార్చి గేటు వరకు వచ్చి వదిలి "రేపు హోంవర్క్ చేసుకుని వస్తావు కదూ" నవ్వుతూ అడిగాడు.

తను పెద్దయిన తరవాత ఫాదర్ అవుతాను అని అనుకుంటూ  తేలికపడిన హృదయంతో ఇంటికి వెళ్ళాడు.

"అమ్మ ఇంట్లో లేదు. చెల్లిని తీసుకుని పేరంటానికి వెళ్ళారు బల్లమీద టిఫిన్ వుంది తినండి బాబు" అని రంగన్న చెప్పాడు. "అమ్మ వచ్చాకే తింటా!" రంజన్ తల ఎగరవేశాడు. ఇంగ్లీషు వ్యాసం రేపు చూపించాలి. నోట్స్ లేదు. కొనాలి తాళాలు సుజన ఎక్కడ దాస్తుందో తెలుసు. బీరువాలో నుంచి పర్సు తీశాడు.

నోట్లలో రూపాయి కోసం చూస్తున్నాడు. ఆ సమయంలో భుజం మీద చెయ్యి పడగానే ఉలిక్కిపడ్డాడు. నిప్పులు కురిపిస్తున్న తండ్రి కళ్ళను చూసి భయంతో ముడుచుకుపోయాడు. చెళ్ళుమన్న చెంప దెబ్బతో తూలి అవతల పడ్డాడు. కోపంతో నడుముకున్న బెల్టు విప్పుతుంటే చెంపకు చెయ్యి ఆనించుకుని తనను ఎందుకు కొట్టినట్లు? అర్ధం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ లేస్తుంటే వీపుపై బెల్ట్ దెబ్బ పడింది.

"అమ్మా!" అంటూ అప్రయత్నంగా గావుకేక పెట్టాడు. దెబ్బమీద దెబ్బ పడుతుండగా  సుజన లోనికి వచ్చింది. "అమ్మో! అమ్మో బాబుని చంపేస్తున్నారు" అని దెబ్బలకి అడ్డు నిల్చుంది. ఆ దెబ్బ సుజన వీపుపై చుర్రుమంది.

బెల్టు దూరంగా విసిరేస్తూ "వెధవ.. దొంగతనం మొదలుపెట్టాడు. సుజనా వాడు పర్సులో డబ్బు కొట్టేస్తున్నాడు" సంజాయిషిగా చెపుతుంటే తనని పొదవి పట్టుకున్న అమ్మ చేతుల్లో వెక్కి వెక్కి  ఏడుస్తున్న చిత్తరంజన్ ఏడ్పు మాని కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

ఆ కళ్ళలో కనిపించిన ఆశ్చర్యం, కోపం బాధ మరింకేవో వ్యక్తం చేయలేని భావాలు చూసి నిరంజన్ మరింక మాట్లాడలేక పోయాడు. తొందరపడ్డానా? అనుకుంటూ ఆ గదినుంచి బయటకు వచ్చేశాడు.

తన కన్నకొడుకు తన చింత దొంగతనంగా డబ్బులు తీస్తాడని నమ్మలేని సుజన "డబ్బుతో ఏం పని వచ్చింది?" అంది చొక్కా విప్పుతూ.

'నోట్స్ కొనుక్కుందామనుకున్నాను' పర్సు నుంచి బయటపడిన రూపాయి నోటువంక చూశాడు. ఇప్పుడతని కంఠంలో దుఃఖం లేదు.

వీపు మీద వాతలు ఎర్రగా తేలాయి వాటిని చూసి సుజన పెద్దగా ఏడుస్తుంటే చొక్కా వేసుకుని పుస్తకాల బల్ల దగ్గరకు వెళ్ళాడు.

తన ఇంట్లో అవసరానికి డబ్బులు తీసుకోవటం దొంగతనమా? చెల్లాయి ఇష్టం వచ్చినప్పుడు చిల్లర డబ్బులు తీస్తుంది. అది దొంగతనం కానప్పుడు ఇదెలా అవుతుంది? రంజన్ మనసు విపరీతంగా ఆలోచనలో పడింది.

"బాబుని అనవసరంగా అన్ని దెబ్బలు కొట్టాడు. ఎందుకు తీస్తున్నావ్? ఏం అవసరమొచ్చింది. అని అడగలేదు. దొంగను చేసి నిర్దయగా బాదాడు నిరంజన్. అతన్ని అర్థం చేసుకోలేకపోయింది. కూతుర్ని అపురూపంగా చూసుకుంటాడు. కొడుకుని శత్రువులా చూస్తున్నాడు. ఈర్ష్య ఇలా వుంటుందా? తన ఊహకందనిది ఏదో వుంది. ఏమిటీ? ఏమిటీ? ఎవర్ని అడగాలి? దేవుడా.. దీనికి పరిష్కారం లేదా? బాబుని అమ్మదగ్గర వుంచాలి. వాడి చిన్న మనస్సుకు దెబ్బ తగలకముందే ఏదో ఒకటి చెయ్యాలి అని సుజన అనుకుంది.

ఆ రోజు కాంపోజిషన్ వ్రాయలేదు. మాష్టారు మళ్ళీ ఫాదర్ దగ్గరికి పంపుతాడు. కారణం ఏమని చెపుతాడు. జ్వరం వచ్చినట్లున్నా చిత్తరంజన్ సంచిని భుజాన తగిలించుకుని స్కూలుకి దారి పట్టాడు.

దారిలో చెట్టు క్రింద పిల్లలు గోళీలు ఆడుతున్నారు, అతను ఎప్పుడు వచ్చాడో ఏమో? ఆటలాడే ఒక పిల్లాడిని జవిరి పట్టుకుని చావు దెబ్బలు కొడుతూ ఈడ్చుకుపోతుంటే ఆ పిల్లాడి ఏడ్పులకి ఎందరో అక్కడ నిల్చుండిపోయారు. ఒకరిద్దరు వారించబోయారు. అంతలో ఆ పిల్లాడు వదిలించుకుని పరుగుతీశాడు. అతను బండ బూతులు తిడుతూ వెంటబడ్డాడు.

"చచ్చేది బతికేది తెలియకుండా కొట్టి చెవులు మూసేలా వున్నాడు. వాడి అబ్బేనా?" గంపలు పట్టుకుని చోద్యం చూస్తున్న ఒకామె అంది.

"ఆ పిల్లాడు వాడికి పుట్టలేదని అనుమానం. తాగినప్పుడల్లా బయటపడతాడు. సాకు దొరికితే చాలు వాడ్ని చావతంతాడు." ఆ ఇంట్లో సంగతి బాగా తెలిసినామె అందుకుంది.

చిత్తరంజన్ వారి మాటలు స్పష్టంగా విన్నాడు. ఆ చెట్టు కిందనే కూర్చున్నాడు.

చీకటి పడుతుండగా ఇంటిదారి పట్టాడు. అమ్మ ఆత్రంగా బాటవైపు చూస్తుంది. (తనకోసమే) మనస్సు పెద్దగా రోదిస్తుంది.

అమ్మ అలాంటిదనుకుంటే చచ్చిపోవాలనిపిస్తుంది. ప్రేమనంతా కళ్ళల్లో నింపుకుని ఆందోళన పడుతున్న అమ్మను చూశాడు. అమ్మ ప్రేమను పూర్తిగా చవిచూసిన చిత్తరంజన్ మా అమ్మ అలాంటిది కాదు. ఎన్నటికీ కాదు. అమ్మ దేవత. అనుకుంటూ ఇంట్లోకి వచ్చాడు.

అమ్మ స్నానం చేయిస్తుంటే వద్దనలేదు. అమ్మ అన్నం కొసరి కొసరి తినిపించింది. కడుపు నిండినా వద్దనలేదు. బల్లమీద పుస్తకాలన్నిటికీ అట్టలు వేసి స్టిక్కర్స్ అంటించి వున్నాయి. కొత్త నోట్సుల దొంతర ఒక పక్కన వుంది. బాబును మరిపించి మరిపించి చదువు మీద ఆశక్తి కలిగించాలని సుజన ప్రయత్నం. పని చేసుకుంటూ అప్రయత్నంగా తిరిగి చూసింది సుజన.

దీర్ఘంగా చిత్తరంజన్ తననే చూస్తున్నాడు. ఏదో అడగాలని, మరేదో చెప్పాలన్నట్లుంది వాడి వైఖరి.

అవాజ్యమైన ప్రేమ పొంగుకు వచ్చింది దగ్గరకు వెళ్ళింది. హృదయానికి హత్తుకుని “బాబూ! ఏం అలా వున్నావు? ఏం కావాలి? నీకు ఈ స్కూలు నచ్చలేదా? అమ్మమ్మ దగ్గరకు వెళ్దామా? ఆ స్కూల్లో చేరు. మామయ్య నీకు అన్నీ నేర్పిస్తాడు"నాన్నలా కొట్టడు అని చెప్పాలనుకుంది చెప్పలేకపోయింది.

"నాన్నకి దూరంగా వుంచాలనుకుంటుంది అమ్మ. తనను చూడకుండా వుండలేని అమ్మ ఇంటినుంచే పంపేయాలనుకుంటోంది.” చిత్తరంజన్‌కి అర్థం అయింది.

పూర్తిగా తెల్లవారలేదు. సుజన బాత్‌రూములోకి పోతూ అలా చిత్తరంజన్ వున్న గదిలోకి చూసింది.

చిత్తరంజన్ పడకమీద లేదు. కడుపు పట్టుకుని నేలమీద మెలికలు తిరిగిపోతున్నాడు. పరుగున వచ్చి బాబుని పట్టుకుంది. వళ్ళంతా చెమట్లు పట్టి చల్లగా వుంది. నోట నురుగు, ముక్కుల్లో రక్తం చూసి పిచ్చగా కేకలు పెట్టింది.

నిరంజన్ పరుగున వచ్చాడు. "బాబూ! బాబూ" ఏడుస్తోంది సుజన. మంచం అవతల పడిన పాకెట్టు చూశారు. ఎలకలమందు. నిరంజన్ వణికిపోతూ నిశ్శబ్దంగా యమయాతన పడుతున్న బాబును భుజాల మీదుగ ఎత్తుకుని ఆసుపత్రికి పరుగుతీశాడు.

నిమిషాలమీద ఇవ్వవలసిన ట్రీట్‌మెంటు ఇచ్చారు.

చావు బ్రతుకుల మధ్య మత్తుగా చిత్తరంజన్ ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్నాయి. సుజన పిచ్చిదానిలా మంచం ప్రక్కన కూర్చుంది. ఎప్పటికో వుబ్బివున్న కనురెప్పలను మెల్లిగా విప్పాడు. పెద్దవైన కంటి పాపల్లో ఎన్నో భావాలు. అమ్మను

ఇప్పటికే బాధపెట్టాను. ఇక ఏ మాత్రం బాధపెట్టకూడదు. కాని తను విధించుకున్న శిక్ష న్యాయమైనదేనా? నిజం తెలుసుకోకుండా చనిపోయినా ఆత్మకు శాంతి వుండదు. అని ఆ పిల్లవాడి భాషకందని భావాలు.

"అ...మ్మా...మా...నా...న్న ...ఎ...వ..రు?" అడిగేశాడు.

"బాబూ!!"

ఆ మాటలు విన్న నిరంజన్ ఉలిక్కిపడ్డాడు. తాను ఎన్నోసార్లు ఆ మాట అడగాలనుకున్నాడు. తనకా ధైర్యం లేకపోయింది.

సుజన తన కన్నకొడుకుని దీర్ఘంగా చూసింది. కంటి రెప్పలు వాలిపోయి అంతా స్పష్టంగా చూడగలిగింది.

ఎప్పుడో మరచిపోయాననుకున్న సంఘటన కళ్ళముందు నిల్చింది.

సంధ్యా సమయం. సూర్యుడు కొండచాటునున్నాడు. పార్కులో సుజన కమలాకర్ కొరకు ఎదురు చూస్తుంది. సుజన ప్రేమకు వయస్సు మూడేళ్ళు. బి.ఎ పూర్తి చేసింది. పెళ్ళి ప్రయత్నాల్లో వుండమని అమ్మ నాన్నని హెచ్చరిస్తూ వుంటే వింది.

ఆ ప్రయత్నాలేవో గట్టిపడకముందే కమలాకర్‌తో ఓ నిశ్చయానికి వస్తే మంచిదనిపించి పెళ్ళి విషయం ఎలా ఎత్తాలి? అనుకుంటూ నేలపై గీతలు గీస్తుండగా కమలాకర్ వచ్చి కూర్చుంటూ "సారీ! లేటైంది" అన్నాడు.

అతని గొంతులో ఉత్సాహం, ముఖంలో సంతోషం లోపించినట్లుంది. సూటిగా సుజన కళ్ళల్లోకి చూడలేక ముఖం తప్పించాడు.

అతనిలోని మార్పును గుర్తించి "అలా వున్నారేం?" అంది.

"మా నాన్నగారు వచ్చారు"

"...?"

"యాభై వేల కట్నంతో పెళ్ళి సంబంధం నిశ్చయం చేసుకుని నన్ను తీసుకుపోటానికి వచ్చారు."

"?..."

"నాన్నతోవెళ్ళక తప్పదు. సుజన నీవు నన్ను పిరికివాడ్నని, వ్యక్తిత్వం లేదని దూషించవచ్చు. కాని నాకెప్పుడూ డబ్బు మీద వ్యామోహం లేదు. మా ఇంటి పరిస్థితులు నా పెళ్ళి మీదనే ఆధారపడి వున్నాయని నాన్న యిప్పుడు చెప్పేవరకు తెలియదు. నా స్వార్థం చూసుకుని నా ప్రేమ కోసం వారిని కష్టపెట్టలేను.."

"...."

"నన్ను క్షమించమని అడగటం లేదు. మనుష్యుల బలహీనతలు వాటిని కల్పించే పరిస్థితులు అర్థం చేసుకోమంటాను.."

"....."

"సుజనా ఇలా నీతో మాట్లాడుతుంటే మనస్సు సిగ్గుతో చచ్చిపోతోంది. మా వాళ్ళకి కావలసింది కట్నం..నాకు..నాకు నువ్వు కావాలి సుజనా! మీ వాళ్ళు కట్నం ఇచ్చుకోగలరా?"

సిగ్గుతో చచ్చిపోతున్నానంటూ ప్రేమించానన్న అభిమానం లేకుండా అలా అడుగుతున్న కమలాకర్ వైపు చూట్టానికే సిగ్గు పడినట్లు తలవంచుకుంది.

అంత కట్నం ఇచ్చుకోగల తాహతవున్నా కమలాకర్‌ని మాత్రం చేసుకోదు అదే నిజం అనుకుంది సుజన.

సూర్యుడు లేని వెలుతురు ఎంతోసేపు వుండదు. ఒకరికొకరు గుడ్‌బై చెప్పుకుని స్నేహితుల్లా విడిపోయారు.

వారిమధ్య ఉండినది స్నేహమైన ప్రేమ. తనేమీ పోగొట్టుకోలేదు. అందుకే అతనిని అంత సుళువుగా మర్చిపోగలిగింది.

సుజన నిలువెల్లా వణికిపోతూ "బాబూ!" అంది.

"బాబూ.. మీ నాన్న నిరంజన్. మీ నాన్న అనుకున్న తప్పు మీ అమ్మ చెయ్యలేదురా. నీ పుట్టుక పవిత్రమైంది నమ్ముతావా నాన్నా.."

ఎండిపోయిన పెదవుల మధ్య సూర్యుడుదయించినట్లుంది చిత్రరంజన్ నవ్వు.

"అమ్మ మంచిది" మాట గొంతులో గురగురమంది. కాళ్ళవైపుకి వచ్చి నిల్చున్న నిరంజన్ని నిర్భయంగా చూశాడు.

"డా....డీ...గుడ్....బె...బైయ్" అతి కష్టంగా మాటలు కూడపలుక్కుని పలికాడు.

"బాబూ చిత్రా" కాళ్ళను కౌగలించుకున్నాడు నిరంజన్.

తండ్రి కన్నీటిలో కారిపోతున్న ప్రేమలో చిత్తరంజన్ అంతిమయాత్ర చేశాడు.

COMMENTS